క్లుప్తంగా...

సీఎంఆర్ఎఫ్ పేదలకు వరం



చెక్కు అందజేస్తున్న డిప్యూటీ మేయర్ శ్రీనివాస్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 8వ డివిజన్‌కు చెందిన శర్భానాకు సీఎం రిలీఫ్ ఫండ్ నుంచి మంజూరైన రూ.60 వేల చెక్కును గురువారం డిప్యూటీ మేయర్ రెడ్డిశెట్టి శ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం సహాయ నిధి నిరుపేదలకు వరంలాంటిదన్నారు. కార్యక్రమంలో నాయకులు శ్రీమన్, వెంకటేష్, రమణప్ప, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

స్వచ్ఛ సర్వేక్షణ్‌పై అవగాహన సదస్సు



ఘట్‌కేసర్: స్వచ్ఛ సర్వేక్షణ్‌పై స్థానిక ఎంపీడీఓ కార్యాలయంలో సర్పంచులు, కార్యదర్శులకు గురువారం అవగాహన సదస్సు నిర్వహించారు. ముఖ్యఅతిథిగా ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి హాజరయ్యారు. ఈ సందర్భంగా తడి పొడి చెత్త, సామూహిక మరుగుదొడ్లు, మూత్రశాలలపై చర్చించారు. గ్రామంలోని చౌరస్తాల్లో సామూహిక మరుగుదొడ్లు నిర్మిస్తే ప్రభుత్వం రూ.5 లక్షలు అందజేస్తోందని, డీఆర్‌డీఓ శ్రావణ్ వివరించారు. కార్యక్రమంలో ఎంపీఓ నందకిశోర్, సర్పంచులు గోపాల్‌రెడ్డి, వెంకటేశ్‌గౌడ్, శివశంకర్, పద్మ, కావేరి, జలజ, యాదగిరి, సురేశ్, పంచాయతీ కార్యదర్శులు పాల్గొన్నారు.

విజ్ఞాన భారతిలో క్రికెట్ పోటీలు షురూ..



క్రీడాకారులను పరిచయం చేసుకుంటున్న ప్రిన్సిపల్ శ్రీనివాస్, పీడీ శ్రీనివాస్‌రెడ్డి

ఘట్‌కేసర్: అవుషాపూర్ విజ్ఞాన భారతి ఇంజినీరింగ్ కళాశాలలో స్పోర్ట్స్ డే పురస్కరించుకొని ప్రిన్సిపల్ పీవీఎస్ శ్రీనివాస్ క్రికెట్ పోటీలను గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపల్ క్రీడాకారులను పరిచయం చేసుకున్నారు. కళాశాల బ్రాంచ్‌ల మధ్య నిర్వహిస్తున్న పోటీలు ఈ నెల 27 వరకు కొనసాగుతాయని పీడీ శ్రీనివాస్‌రెడ్డి తెలిపారు. కార్యక్రమంలో కిశోర్, శివలాల్, విశ్వాస్, క్రీడాకారులు పాల్గొన్నారు.

ఎర్లీబర్డ్ స్కీమ్‌ను సద్వినియోగం చేసుకోవాలి



ఇంటి పన్ను చెల్లిస్తున్న మున్సిపల్ చైర్మన్ చంద్రారెడ్డి

కీసర: నాగారం మున్సిపాలిటీ పరిధిలోని ప్రజలందరూ ఈ నెలఖారులోపు ఇంటి పన్నులు చెల్లించి 5 శాతం పన్నురాయితీని పొందాలని నాగారం మున్సిపల్ చైర్మన్ కౌకుట్ల చంద్రారెడ్డి అన్నారు. గురువారం మున్సిపల్ కార్యాలయంలో ఇంటి పన్ను 5 శాతం రాయితీతో రూ.91,540 చెల్లించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఏప్రిల్ 30వ తేదీ వరకు ఈ స్కీమ్ అందుబాటులో ఉంటుందని, సద్వినియోగం చేసుకోవాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వాణీరెడ్డి, మేనేజర్ చంద్రశేఖర్, బిల్‌కలెక్టర్లు తదితరులు పాల్గొన్నారు.

వాత్సల్య పథకంపై అవగాహన



అవుషాపూర్‌లో వాత్సల్య పథకంపై అవగాహన కల్పిస్తున్న సర్పంచ్ కావేరి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న వాత్సల్య పథకాన్ని అర్హులందరూ సద్వినియోగం చేసుకోవాలని అవుషాపూర్ సర్పంచ్ కావేరి అన్నారు. కరోనాతో తల్లిదండ్రులను కోల్పోయిన అనాథ పిల్లలకు వాత్సల్య పథకం నుంచి కేంద్రం అందజేస్తున్న భృతి, దరఖాస్తు విధానం, అర్హతపై గ్రామంలో గురువారం అవగాహన కల్పించారు. కార్యక్రమంలో మశ్చేందర్‌రెడ్డి, వెంకట్‌రెడ్డి, సాయిలు, ప్రవీణ్, వెంకటేశ్ పాల్గొన్నారు.

నేటి నుంచి లక్ష్మీనృసింహుడి బ్రహ్మోత్సవాలు

- నేటినుంచి చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి వార్షిక బ్రహ్మోత్సవాలు
- భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు చేశామన్న ఆలయ సిబ్బంది



చీర్యాల శ్రీలక్ష్మీనృసింహస్వామి దేవస్థానం

కీసర: భక్తుల కొంగు బంగారంగా పేరొందిన శ్రీచీర్యాల లక్ష్మీనృసింహస్వామి పంచదశ(15వ) వార్షిక బ్రహ్మోత్సవాలు నేటి నుంచి 17వ తేదీ వరకు కొనసాగుతాయి. బ్రహ్మోత్సవాలను వైభవంగా నిర్వహించేందుకు దేవస్థానం ఆధ్వర్యంలో ఏర్పాట్లు పూరయ్యాయి. దేవస్థానం వేదపండితులతోపాటు, యాదాద్రి దేవాలయ ప్రధాన అర్చకుడి ఆధ్వర్యంలో బ్రహ్మోత్సవాల ప్రత్యేక పూజలు జరగనున్నాయి. నగరంలోని నలుమూలల నుంచి పెద్ద సంఖ్యలో హాజరయ్యే భక్తుల కోసం క్యూ ఏర్పాటు చేశారు. వేసవిని దృష్టిలో పెట్టుకొని ఆలయ పరిసరాల్లో చలువ పందిళ్లు, భక్తులు సేదతీరేందుకు ఏర్పాట్లు పూర్తిచేశారు. ఇక ప్రధాన దేవాలయంతోపాటు గోపురాలు, పరిసరాల్లో విద్యుత్ దీపాలను ఏర్పాటు చేశారు. స్వామి దర్శనం నిమిత్తం పలువురు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఉన్నతాధికారులు హాజరుకానుండటంతో వారి కోసం ప్రత్యేక ఏర్పాట్లు పూర్తిచేశారు. బ్రహ్మోత్సవాలు పూర్తయ్యే వరకు దేవస్థానం తరఫున ప్రతిరోజూ భక్తులకు భోజన వసతి కల్పిస్తారు.

- మొదటి రోజు శుక్రవారం ఉదయం ప్రత్యేక పూజలు కొనసాగుతాయి. సాయంత్రం స్వామివారి గ్రామోత్సవం(ఊరేగింపు సేవ) తదితర పూజా కార్యక్రమాలు ఉంటాయి. శనివారం విష్వక్సేన పూజ, పుణ్యాహవచనం, రక్షాబంధనం, అఖండ జ్యోతి స్థాపన, అంకురార్పణ, అగ్నిప్రతిష్ఠ తదితర పూజలు ఉంటాయి. మూడో రోజైన ఆదివారం లక్ష్మీనృసింహస్వామివారి తిరుకల్యాణ మహోత్సవం, సుదర్శనారసింహ యాగం(హోమం) ఉంటాయి. ముగింపు రోజైన సోమవారం అలంకరణ, పంచహారతులు, నివేదన చక్రస్నానం, సాయంత్రం సాముహిక శ్రీవిష్ణు సహస్రనామ పారాయణం, రుత్విక్‌సన్మానం, స్వామివారి పల్లకీసేవ, పవళింపు సేవ తదితర పూజలు ఉంటాయి.

భక్తులకోసం అన్ని ఏర్పాట్లు



వివిధ ప్రాంతాల నుంచి స్వామి వారి దర్శనం కోసం వచ్చే భక్తుల కోసం అన్ని ఏర్పాట్లు పూర్తిచేశాం. క్యూ, చలువ పందిళ్లు, తాగునీటి సౌకర్యం, లడ్డూ ప్రసాదాలు, పార్కింగ్, ప్రతిరోజూ అన్నదాన కార్యక్రమం తదితర ఏర్పాట్లు పూర్తిచేశాం. వివిధ ప్రాంతాల నుంచి ఆర్టీసీ ప్రత్యేక బస్సులు ఆలయం వరకు నడిపిస్తారు.

– మల్లారపు లక్ష్మీనారాయణ, ఆలయ చైర్మన్





కేంద్ర పథకాలను అడ్డుకుంటున్న రాష్ట్రం

ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి



మాట్లాడుతున్న ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి

ఘట్‌కేసర్: కేంద్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను రాష్ట్ర ప్రభుత్వం అడ్డుకుంటోందని ఎంపీపీ సుదర్శన్‌రెడ్డి విమర్శించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మాదారం సర్పంచ్ యాదగిరితో కలిసి గురువారం విలేకరులతో ఆయన మాట్లాడారు. తల్లిదండ్రులు లేని పిల్లలు, కరోనాతో అనాథలైన పిల్లలకు కేంద్ర ప్రభుత్వం వాత్సల్య పథకం పేరుతో భృతి ఇవ్వాలనుకుంటోందన్నారు. దరఖాస్తు చేసుకోవడానికి ఈనెల 15వ తేదీతో గడువు ముగుస్తోందని, దీనిపై అధికార యంత్రాంగం ఎటువంటి ప్రచారం చేయలేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పేదల కోసం కేంద్రం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలపై రాష్ట్ర ప్రభుత్వం అవగాహన కల్పించకపోవడంతో కేంద్ర పథకాలకు పేదలు దూరం అవుతున్నారన్నారు. ఇప్పటికైనా జిల్లా, మండల అధికారులు స్పందించి కేంద్ర సంక్షేమ పథకాలపై ప్రజలకు అవగాహన కల్పించాలని సూచించారు.

కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం



మాట్లాడుతున్న యూసుఫ్

మేడ్చల్: కేంద్ర ప్రభుత్వం అవలంభిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలపై పోరాటం చేయాలని రాష్ట్ర ఏఐటీయూసీ అధ్యక్షుడు యూసుఫ్ అన్నారు. మేడ్చల్‌లో నిర్వహించిన జిల్లా ఏఐటీయూసీ కౌన్సిల్ సమావేశంలో ఆయన పాల్గొని ప్రసంగించారు. దేశంలోని కార్మిక సంక్షేమం కోసం 1920 సంవత్సరంలో ఏఐటీయూసీ ఆవిర్భవించిందని, ఆవిర్భావం నుంచి కార్మికుల సంక్షేమం కోసం, వారి సమస్యల పరిష్కారం కోసం నిరంతరం పోరాటం చేసి ఎన్నో విజయాలు సాధించిందని అన్నారు. కేంద్ర ప్రభుత్వం అనుసరిస్తున్న కార్మిక వ్యతిరేక విధానాలను ఎండగడుతూ పోరాటం చేస్తోందన్నారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి జయేంద్ర, నాయకులు శశిధర్‌రెడ్డి, మహేంద్ర, జనార్దన్‌రెడ్డి, హరినాథరావు తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రాభివృద్ధి బీఆర్ఎస్‌తోనే సాధ్యం



భూగర్భ డ్రైనేజీ పనులను ప్రారంభిస్తున్న కార్పొరేటర్ మురుగేష్

జవహర్‌నగర్: జవహర్‌నగర్ కార్పొరేషన్ 5వ డివిజన్‌లోని న్యూ అంబేడ్కర్‌నగర్ కాలనీలో నిర్మించే భూగర్భ డ్రైనేజీ పనులను గురువారం కార్పొరేటర్ ఏకే.మురుగేష్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం కేసీఆర్ నేతృత్వంలోని బీఆర్ఎస్ ప్రభుత్వంతోనే రాష్ట్రాభివృద్ధి జరిగిందన్నారు. మంత్రి మల్లారెడ్డి సహకారంతో జవహర్‌నగర్ ఎంతో అభివృద్ధి చెందిందన్నారు. కార్యక్రమంలో నాయకులు సింగన్న బాలరాజు, ఆనంద్, లక్ష్మీ, కృష్ణయాదవ్, బాలరాజు, ఆంజనేయులు, రాజు, చంద్రమౌళి, నాగేష్ తదితరులు పాల్గొన్నారు.

పోలీస్ శభాష్..

- రోడ్డుకు మరమ్మతులు చేయించి..
- వాహనదారులకు ఊరట కలిగించి..
- పోలీసులకు పలువురి అభినందనలు

మేడ్చల్: గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందిగా మారడంతో మేడ్చల్ ట్రాఫిక్ పోలీసులు స్పందించి మరమ్మతులు చేయించి ప్రయాణికుల ఇబ్బందులను తొలగించారు. మేడ్చల్-గండిమైసమ్మ రోడ్డులో సుతారిగూడ వద్ద, రింగు రోడ్డు వద్ద, గౌడవెల్లి కమాన్ వద్ద, గుంతలు ఏర్పడి వాహనదారులకు ఇబ్బందులు రావడంతో ట్రాఫిక్ సీఐ నర్సింహారెడ్డి తన బృందంతో కలిసి మరమ్మతులు చేయించారు. దాతల సహకారంతో బీటీ తెప్పించి గుంతల్లో వేయించి మరమ్మతులు చేశారు. అయోధ్య చౌరస్తా వద్ద రోడ్డు మధ్యలో డివైడర్ లేకపోవడంతో రైల్వే గేటు పడిన సమయంలో వాహనదారులు ఇష్టానుసారంగా గేట్ వద్దకు వెళ్లడం.. గేట్ తీయగానే గంటల తరబడి ట్రాఫిక్ జాం కావడంతో సమస్యను పరిష్కరించారు. తాత్కాలిక డివైడర్ల (కోన్స్)ను ఏర్పాటు చేశారు. వాహనదారులు నిబంధనలు పాటించాలని, ట్రాఫిక్ జామ్ కాకుండా జాగ్రత్త పడాలని సీఐ కోరారు.



రోడ్డుపై గుంతలలో బీటీ వేయించిన ట్రాఫిక్ పోలీసులు



రోడ్డు మధ్యలో ప్లాస్టిక్ పోల్స్ ఏర్పాటు చేసిన ట్రాఫిక్ పోలీసులు

12వ వార్డులో కంటి వెలుగు ప్రారంభం



కంటి అద్దాలను అందజేస్తున్న కౌన్సిలర్ ప్రియాంక మధుకర్‌యాదవ్

మేడ్చల్: మేడ్చల్ మున్సిపాలిటీ పరిధిలో కంటి వెలుగు కార్యక్రమాన్ని కౌన్సిలర్ ప్రియాంక మధుకర్ బుధవారం ప్రారంభించారు. వార్డులో ఏర్పాటు చేసిన కంటి వెలుగు శిబిరాన్ని వైద్యులతో కలిసి ఆమె ప్రారంభించి అద్దాలు పంపిణీ చేశారు. వార్డు ప్రజలు కంటి వెలుగు శిబిరానికి హాజరై కంటి పరీక్షలు చేయించుకుని అవసరమైన వారు అద్దాలు, మందులు పొందాలని ఆమె కోరారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ పట్టణ అధ్యక్షుడు శేఖర్‌గౌడ్, నాయకులు శ్రీకాంత్, మధుకర్‌యాదవ్, పాండుగుప్తా, ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.

నర్సింహారెడ్డి కళాశాలలో స్టూడెంట్ అసోసియేషన్



స్టూడెంట్ అసోసియేషన్‌ను ప్రారంభిస్తున్న కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి తదితరులు

మేడ్చల్‌రూరల్: గుండ్లపోచంపల్లి మున్సిపాలిటీ పరిధి మైసమ్మగూడలోని నర్సింహారెడ్డి ఇంజినీరింగ్ కళాశాలలో స్టూడెంట్ అసోసియేషన్ ఏర్పాటు చేశారు. మెకానికల్ విద్యార్థులు ఏర్పాటు చేసిన అసోసియేషన్‌ను గురువారం కళాశాల చైర్మన్ నర్సింహారెడ్డి, ప్రిన్సిపాల్ లోకనాథం ఆధ్వర్యంలో కమిటీని నియమించారు. సంఘం అధ్యక్షుడిగా షేక్ జకీర్, ఉపాధ్యక్షుడిగా మౌనిక, కార్యదర్శిగా సాయికిరణ్, కోశాధికారి స్వర్ణతో పాటు సభ్యులుగా రాహుల్‌కుమార్, అభిలాష్, శంకర్‌ను ఎన్నుకున్నారు. అసోసియేషన్ ఏర్పాటుతో విద్యార్థుల్లో నాయకత్వ లక్షణాలు పెరుగుతాయన్నారు. కార్యక్రమంలో కళాశాల సెక్రటరి త్రిశూల్‌రెడ్డి, త్రిలోక్‌రెడ్డి, డైరెక్టర్ మోహన్‌బాబు, హెచ్‌ఓడీ అశోక్‌కుమార్, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

బిట్స్ పిలానీలో మహిళా ఉద్యోగులకు ప్రత్యేక శిక్షణ



ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని ప్రారంభిస్తూ..

జవహర్‌నగర్: జవహర్‌నగర్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని బిర్లా ఇనిస్టిట్యూట్ ఆఫ్ టెక్నాలజీస్ అండ్ సైన్స్(బిట్స్ పిలానీ) క్యాంపస్‌లో మోహో సోషల్ ఇనిషియేటివ్స్, ప్యూర్ ఎలక్ట్రిక్ మోటార్స్, బిట్స్ సంయుక్తాధ్వర్యంలో మహిళా సెక్యూరిటీ గార్డులు, హౌస్ కీపర్లు, గార్డెనర్స్‌కు ప్రత్యేక శిక్షణ కార్యక్రమాన్ని గురువారం బిట్స్ పిలానీ క్యాంపస్ డైరెక్టర్ జి.సుందర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. బిట్స్ పిలానీ క్యాంపస్‌లో వివిధ రంగాల్లో సేవలు అందిస్తున్న మహిళా కార్మికులకు ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు తెలిపారు. మహిళలకు నాలుగు వారాలపాటు శిక్షణ ఇచ్చి ఉద్యోగ భద్రత కల్పిస్తున్నట్లు తెలిపారు. శిక్షణ అనంతరం ఎలక్ట్రిక్ ద్విచక్ర వాహనాలను అందించి రోడ్డు భద్రత నియమాలు, వృత్తి నైపుణ్యత శిక్షణ అందించి లైసెన్సు పొందేందుకు సహకారం అందిస్తున్నామన్నారు. కార్యక్రమంలో బిట్స్ పిలానీ క్యాంపస్ అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

విద్యా వలంటీర్లకు వేతనాలు



విద్యా వలంటీర్లకు వేతనం అందజేస్తున్న కౌన్సిలర్ నర్సింగ్‌రావు, ఆనంద్

ఘట్‌కేసర్: పట్టణంలోని జెడ్పీ బాలికల పాఠశాలలో హిందీ, తెలుగు ఉపాధ్యాయుల కొరత ఉన్నందున జన చైతన్య సేవా సమితి ఆధ్వర్యంలో ఇద్దరు విద్యా వలంటీర్లను గతంలో నియమించారు. వలంటీర్లకు మార్చి మాసం వేతనం ఒక్కరికి రూ.7 వేల చొప్పున ఇద్దరికి కలిపి రూ.14 వేలను 17వ వార్డు కౌన్సిలర్ బేతాల నర్సింగ్‌రావు, ఆనంద్ గురువారం అందజేశారు. ఉపాధ్యాయురాలు ఉమా, శ్రీనివాస్‌గౌడ్, విద్యా వలంటీర్లు సౌందర్య జ్యోతి, జావేద పాల్గొన్నారు.

మృతుల కుటుంబాలకు ఆర్థిక సాయం



మంత్రి మల్లారెడ్డి ట్రస్టు ఆధ్వర్యంలో ఆర్థిక సాయం అందజేస్తూ..

కీసర: గ్రామాల్లో అనారోగ్యం కారణంగా మృతి చెందుతున్న పేద కుటుంబాలకు రూ.5 వేల చొప్పున మంత్రి మల్లారెడ్డి ట్రస్టు నుంచి ఆర్థిక సాయం అందజేయడం అభినందనీయమని కీసర గ్రామసర్పంచ్ నాయకపు మాధురి, బీఆర్ఎస్ మండల అధ్యక్షుడు జలాల్‌పురం సుధాకర్‌రెడ్డి అన్నారు. గురువారం కీసర గ్రామపంచాయతీ పరిధిలో ఇటీవల అనారోగ్య కారణంగా మృతి చెందిన కొమలి మురిగేషన్, పిట్టల విఠల్, పగిడిపాల వెంకటస్వామి కుటుంబసభ్యులను వారు పరామర్శించి ట్రస్టు తరఫున ఒక్కో కుటుంబానికి రూ.5 వేల చొప్పున ఆర్థిక సాయం అందజేశారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ రామారం సుజాత, బీఆర్ఎస్ నేతలు బాల్‌రాజ్, గణేష్, సుమన్, బన్ని, పరమేష్, మహేష్, రాఘవేందర్‌గౌడ్, సతీస్‌యాదవ్, మధుయాదవ్ తదితరులు పాల్గొన్నారు.

గ్రంథాలయాన్ని సందర్శించిన విద్యార్థులు

మేడ్చల్: పట్టణంలోని ఎస్ఎస్‌జీ స్కూల్‌కు చెందిన చిన్నారులు జిల్లా గ్రంథాలయాన్ని సందర్శించారు. ఔట్ డోర్ ట్రిప్‌లో భాగంగా చిన్నారులు గ్రంథాలయకు వెళ్లి అక్కడ ఉన్న పుస్తకాలను పరిశీలించారు. విద్యార్థులకు సంస్కృతి, చరిత్ర వంటి అంశాల పుస్తకాలను అలవాటు చేసేందుకు లైబ్రరీని సందర్శించినట్లు ప్రిన్సిపాల్ రాధాకృష్ణ తెలిపారు.



సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలి

రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్



అల్వాల్: సైబర్ నేరాల పట్ల ప్రజలు అప్రమత్తంగా ఉండాలని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అధికారులకు సూచించారు. గురువారం నేరేడ్‌మెట్‌లోని రాచకొండ కమిషనరేట్ సైబర్ క్రైమ్ విభాగం అధికారులు, సిబ్బందితో ఆయన సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆధునిక సాంకేతిక కాలంలో అందుబాటులోకి వస్తున్న కొత్త సాంకేతిక పరిజ్ఞానం, పరికరాల వల్ల సైబర్ నేరాల శాతం పెరుగుతోందని తెలిపారు. వివిధ రకాల అవసరాలకు అనుగుణంగా సాంకేతిక పరికరాలు ఉపయోగించక తప్పదన్నారు. కానీ అదే సమయంలో ప్రజలు సైబర్ నేరాల గురించి అవగాహన కలిగి ఉండాలని పేర్కొన్నారు. సైబర్ నేరాల గురించి ప్రజల్లో అవగాహన పెరిగేలా యువత భాగస్వామ్యంతో కళాశాలలు, ఇతర ప్రదేశాల్లో కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులకు సూచించారు. నకిలీ లాటరీలు, నకిలీ ఉద్యోగ ప్రకటనలు, నకిలీ బ్యాంకు అకౌంట్ సమాచారం, నకిలీ గిఫ్ట్ బాక్సుల వంటి పేరుతో ప్రజలను మోసం చేసే వారిని కఠినంగా శిక్షిస్తామన్నారు. సోషల్ మీడియాలో యువతులను వేధించే వానికి ఎట్టి పరిస్థితులలోనూ విడిచి పెట్టకూడదని అధికారులకు సూచించారు. పోలీసుల కృషి, కఠిన చర్యలతో రాచకొండ కమిషనరేట్ పరిధిలో చైన్ స్నాచర్ల బెడద చాలా వరకు తగ్గిందని, మహిళలు ప్రశాంతంగా బయటకు వెళ్లి తమ పనులు చేసుకుంటున్నారని తెలిపారు. చైన్ స్నాచింగ్ వంటి నేరాలకు పాల్పడే వారిని ఉపేక్షించేది లేదని తెలిపారు. నేరాల సంఖ్య తగ్గుముఖం పట్టేలా అధికారులు సిబ్బంది కలిసి సమన్వయంతో పనిచేయాలని సూచించారు. కార్యక్రమంలో డీసీపీ సైబర్ క్రైమ్స్ అనురాధ, డీసీపీ క్రైమ్ మధుకర్ స్వామి, సైబర్ క్రైమ్ ఏసీపీ వెంకటేశం, ఇన్‌స్పెక్టర్లు, ఇతర సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

సర్కారు బడులకు ట్యాబ్‌లు

- పాఠశాలలను బలోపేతం చేయడమే లక్ష్యం
- శివారు మేడ్చల్, రంగారెడ్డి జిల్లాల్లోని స్కూళ్లకు..
- టీచర్లు, విద్యార్థులకు ఉపయోగపడేలా కసరత్తు



సాక్షి, మేడ్చల్ జిల్లా: ప్రభుత్వ పాఠశాల విద్యను మరింత బలోపేతం చేయడంతో పాటు ఆధునికతను అందుబాటులోకి తెచ్చే దిశగా సర్కారు చర్యలు తీసుకుంటోంది. ప్రాథమిక పాఠశాలల్లో చేరుతున్న విద్యార్థులు.. కరోనా తదితర కారణాలతో కనీస సామర్థ్యాన్ని సాధించలేకపోయారని గుర్తించి ఎఫ్ఎస్ఎన్ కార్యక్రమం కింద ప్రత్యేక శ్రద్ధ చూపుతోంది. తాజాగా ప్రభుత్వ పాఠశాలలకు ట్యాబ్‌లు అందించేందుకు ప్రభుత్వం ముందడుగు వేసింది. వీలైనంత త్వరలో ఎంపిక చేసిన స్కూళ్లకు వీటిని అందించాలంటూ తాజాగా ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది.

సమాచారం నిక్షిప్తం

నగర శివారు మేడ్చల్-మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో కొన్ని ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలల భవనాలు శిథిలావస్థకు చేరాయి. రికార్డులు, విద్యార్థుల ప్రవేశ రిజిస్టర్, మార్కుల వివరాలు, ఉపాధ్యాయుల సమాచారం అంతా లిఖితపూర్వకంగా ఉండటంతో.. కొంత కాలానికి అవసరమైన సమాచారం దొరకడం లేదన్న ఆరోపణలు ఉన్నాయి. విద్యార్థికి వచ్చిన మార్కులు, సహపాఠ్యాంశ ప్రణాళిక అమలులో విద్యార్థి ప్రతిభ తదితర విషయాలు, విద్యార్థి ప్రవేశ సంఖ్య, పాఠశాల వదిలి వెళ్లిన తేదీ తదితర వివరాలన్నీ ట్యాబ్‌లో నిక్షిప్తం చేయనున్నట్లు సమాచారం. వీటి నిర్వహణ, సంరక్షణ బాధ్యత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు చూసుకోవాల్సి ఉంటుంది. ఇప్పటికే మన ఊరు–మనబడి–మన బస్తీ కార్యక్రమం కింద ప్రభుత్వ పాఠశాలలను అందంగా తీర్చిదిద్దడం, బోధనలో నూతనత్వాన్ని పరిచయం చేయడంతో విద్యార్థులు, సమాజం విశ్వాసాన్ని పొందాయి. వచ్చే విద్యా సంవత్సరం నుంచి ఇవి పూర్వవైభవాన్ని సంతరించుకోగలవని విద్యా విశ్లేషకులు అంచనా వేస్తున్నారు.

నగర శివారు మేడ్చల్–మల్కాజిగిరి, రంగారెడ్డి జిల్లాల్లో ట్యాబ్‌ల వివరాలు..

జిల్లా పేరు	ట్యాబ్‌లు
మేడ్చల్–మల్కాజిగిరి	397
రంగారెడ్డి	1,057
మొత్తం	1,454

ఉపాధ్యాయులకు శిక్షణ

ఉపాధ్యాయులు.. పాఠశాల విద్యకు సంబంధించిన సమాచారాన్ని తమ ఫోన్ ద్వారా ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్తున్నారు. వచ్చే విద్యాసంవత్సరం నుంచి ప్రధానోపాధ్యాయులు ట్యాబ్‌ల ద్వారా సమాచారాన్ని ఎప్పటికప్పుడు ప్రభుత్వానికి నివేదించే అవకాశముంటుంది. వీటి నిర్వహణ విషయంలో ఉపాధ్యాయులకు సంబంధిత నిపుణులతో శిక్షణ కూడా ఇప్పించేందుకు ప్రభుత్వం కార్యాచరణ రూపొందిస్తోంది. ప్రస్తుతం ట్యాబ్‌లన్నీ సంబంధిత జిల్లాల విద్యాశాఖలకు ప్రభుత్వం చేరవేసింది.

ట్యాబ్‌ల సామర్థ్యం వివరాలివి..

దేశీయంగా తయారైన శ్యాంసంగ్ గెలాక్సీ ఏ8 రకం బ్రాండు, నాలుగు జీబీ సామర్థ్యమున్న ర్యామ్, 10.8 అంగుళాల నిడివి ఉన్న తెర, 7,000 ఎంఏహెచ్ సామర్థ్యమున్న బ్యాటరీ, 64 జీబీ మెమరీ తదితర ఆధునిక హంగులను ట్యాబ్‌లు కలిగి ఉన్నాయి.